క్లుప్తంగా

ఉపాధ్యాయుడికి షోకాజ్

గుండాల: రికార్డులు లేకుండా, విద్యార్థులకు కనీస సామర్థ్యాలను అందించిక పోవడంతో దేవళ్లగూడెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయునికి షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు ఎంఈఓ కృష్ణయ్య తెలిపారు. బుధవారం దేవళ్లగూడెం ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి విద్యార్థుల అభ్యసనాలను పరిశీలించారు. పాఠశాలలో సీసీఏ నిబంధనల మేరకు నిర్వహించాల్సిన రిజిస్టర్లు, మధ్యాహ్న భోజన రికార్డులు, నమోదు రిజిస్టర్లు అసంపూర్తిగా ఉండడంతో ఉపాధ్యాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఉపాధ్యాయుడికి షోకాజ్ జారీ చేశారు. దీంతో పాటు జిల్లా విద్యాశాఖ అధికారులకు తగు చర్యల నిమిత్తం సమాచారం అందిస్తామని తెలిపారు. మండలంలో ఉపాధ్యాయులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎంఈఓ హెచ్చరించారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

చర్ల: ఏజెన్సీ మండలాలకు కూడలిగా ఉన్న చర్లలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం డివిజన్ కార్యదర్శి మునిగెల శివ డిమాండ్ చేశారు. బుధవారం చర్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చర్లలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో ఈ ప్రాంతంలోని విద్యార్థులు భద్రాచలం, కొత్తగూడెం ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని అన్నారు. చర్ల, దుమ్ముగూడెం, వెంకటాపురం మండలాల్లో ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఉన్నప్పటికీ పేదలు, నిరుపేదలు ఫీజులు కట్టి వాటిల్లో చదవలేని పరిస్థితి నెలకొందని ఆయన అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం ఏళ్ల తరబడిగా పోరాటాలు సాగిస్తున్నప్పటికీ ఏ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఏజెన్సీ ప్రాంతంపై ఎందుకింత నిర్లక్ష్యమని ప్రశ్నించారు. తక్షణమే కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు కార్తీక్, ప్రదీప్, శ్రీకాంత్, ప్రవళిక, రమేష్ పాల్గొన్నారు.

స్వలాభం కోసమే ఫిర్యాదు

భద్రాచలంటౌన్: బీఆర్‌ఎస్ నాయకులు తమ స్వలాభం కోసమే భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్యపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సరెళ్ల నరేష్ బుధవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. గత ఏడాది వరదలతో పట్టణ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, మళ్లీ గోదావరి పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో ఆందోళన మొదలైందన్నారు. ఈ సమస్యపై బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకున్న చర్యలు శూన్యమని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన మాట ప్రకారం నిధులను విడుదల చేసి భద్రాద్రి అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.

నులిపురుగుల నిర్మూలనపై ర్యాలీ

మణుగూరురూరల్: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ.. పిల్లల్లో పౌష్టికాహార లోపం, కడుపునొప్పి, రక్తహీనత సమస్యలతో బాధపడుతూ ఉంటారని, అటువంటి పిల్లల్లో నట్టలు, ఏలిక పాములు, నులిపురుగులు ఉండే అవకాశం ఉందన్నారు. వాటి నిర్మూలన కోసం ప్రతీ ఏటా జూలై 20న జాతీయ నులిపురుగుల దినోత్సవం ద్వారా ఒకటి నుంచి 19 సంవత్సరాల్లోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో, పాఠశాలల్లో, కళాశాలల్లో ఆల్బెండజోల్ మందులను తగు మోతాదులో వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నిశాంత్‌రావు, సీహెచ్‌ఓ వెంకటేశ్వరరావు, దయామణి, రాంప్రసాద్, ఉపేందర్, రాధ తదితరులు పాల్గొన్నారు.

పోడుకు పట్టాలు ఇవ్వాలి

చర్ల: సాగులో ఉన్న పోడు రైతులందరికీ అటవీ హక్కుల చట్టం ప్రకారం హక్కుపత్రాలివ్వాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా చర్ల మండల కార్యదర్శి కొండా చరణ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొక్కుబడిగా మాత్రమే బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇటీవల హక్కుపత్రాలిచ్చిందని, సాగులో ఉన్న ప్రతీ ఎకరాకు హక్కు పత్రం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. పోడుసాగుదారులపై ప్రభుత్వం పెట్టిన అన్నీ కేసులను సత్వరమే ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రేగా ఆంద్రేయ, భానుప్రకాశ్, రాజు, సురేంద్ర, శివ పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం

బూర్గంపాడు: బూర్గంపాడు డీసీసీబీ మేనేజర్ శ్రీనివాస్ రైతులకు అందించిన సేవలు అభినందనీయమని పీఏసీఎస్ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు అన్నారు. బుధవారం బూర్గంపాడు డీసీసీబీ బ్యాంకులో బదిలీపై వెళ్తున్న శ్రీనివాస్‌కు వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బిక్కసాని మాట్లాడారు. ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీబీ కొత్త మేనేజర్ వసుమతి, పీఏసీఎస్ సీఈఓ ప్రసాద్, కార్యదర్శులు ఉమర్, తిరుపతిరెడ్డి, శ్రీకాంత్, నాగలక్ష్మి, రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ ఎన్నికలెప్పుడో..!?

- పాలకవర్గం లేక ముచ్చటగా మూడేళ్లు
- ఎన్నికల కోసం ఆశావహుల ఎదురుచూపులు



బూర్గంపాడు మండల పరిషత్ కార్యాలయం

బూర్గంపాడు: బూర్గంపాడు మండల ప్రజాపరిషత్‌కు పాలకవర్గం లేక ముచ్చటగా మూడేళ్లయింది. 2020 జూలై 5న అప్పటి పాలకవర్గం పదవీకాలం ముగిసింది. నాటి నుంచి నేటి వరకు ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగలేదు. 2014లో రాష్ట్రంలోని అన్ని ఎంపీటీసీ స్థానాలతో పాటుగా బూర్గంపాడు మండల పరిషత్ పరిధిలోని ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి.అయితే రాష్ట్ర విభజన నేపథ్యంలో రెండు ఎంపీటీసీ స్థానాలు ఆంధ్రప్రదేశ్‌లో విలీనమయ్యాయి. ఈ నేపథ్యంలో కొందరు ప్రజాప్రతినిధులు పాలకవర్గాల రిజర్వేషన్ల మార్పు కోసం కోర్టును ఆశ్రయించారు. దీంతో ఎంపీపీ ఎన్నిక ఏడాదిపాటు వాయిదా పడింది. ఎట్టకేలకు ఏడాది తరువాత పాలవర్గం ఎన్నిక జరిగింది. రాష్ట్రంలోని అన్ని మండలాల పాలకవర్గాల పదవీకాలం 2019లో ముగిసింది. బూర్గంపాడు మండల పరిషత్ పాలకవర్గ పదవీకాలం మాత్రం 2020 జూలైలో ముగిసింది. రాష్ట్రంలోని అన్ని మండల ప్రజాపరిషత్‌లకు 2019లోనే ఎన్నికలు నిర్వహించారు. బూర్గంపాడు మండల ప్రజా పరిషత్ పాలకవర్గానికి ఏడాది గడవు ఉండటంతో ఎన్నికలు నిర్వహించలేదు. 2020 జూలైలో అప్పటి పాలకవర్గం పదవీకాలం ముగిసింది, వెంటనే ఎన్నికలు నిర్వహిస్తారని అందరు భావించారు. ఒక్క మండలానికి ఎన్నికలు నిర్వహించేందుకు అటు ప్రభుత్వం, ఇటు ఎన్నికల సంఘం కూడా ఉదాసీనంగా వ్యవహరించాయి. అదే ఏడాది ఎట్టకేలకు ఎన్నికల నిర్వహణ కోసం మండల పరిషత్ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఓటరు లిస్టులు, ఎంపీటీసీ స్థానాల రిజర్వేషన్లు ప్రకటించారు.మండలంలో 14 ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు చేశారు. ఒకట్రెండు నెలల్లో ఎన్నికలు జరుగుతాయని భావించారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో కొంత జాప్యం చోటు చేసుకుంది. అదిగో, ఇదిగో అంటు ఏడాది కాలం గడిచిపోయింది.

2018లో రాష్ట్ర ప్రభుత్వం కొత్త గ్రామపంచాయతీల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ సమయంలోనే సారపాక మేజర్ గ్రామపంచాయతీ నుంచి తాళ్లగొమ్మూరు, కోయగూడెంలను కొత్త గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేశారు. సారపాక మేజర్ గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ గవర్నర్‌కు ప్రతిపాదనలు పంపింది. ఏజెన్సీ చట్టాల కారణంగా ఆ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. ఏడాదిన్నర తరువాత సారపాక మేజర్ గ్రామపంచాయతీని సారపాక, ఐటీసీ గ్రామ పంచాయతీలు విభజించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సారపాకను మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తారని ఉద్దేశ్యంతో గతంలో ఉన్న 18 ఎంపీటీసీ స్థానాలను సారపాకను మినహాయించి మిగతా గ్రామపంచాయతీలలో 14 ఎంపీటీసీ స్థానాలుగా అధికారులు నిర్ణయించారు. ప్రభుత్వం సారపాకను కూడా గ్రామపంచాయతీగా గుర్తించటంతో ఇక్కడ మరో 6 ఎంపీటీసీ స్థానాలు పెరగనున్నాయి. ఈ నేపథ్యంలో మళ్లీ ఎంపీటీసీ స్థానాల సంఖ్య 20కి చేరనుంది. అదేవిధంగా ఎంపీటీసీ స్థానాల రిజర్వేషన్లు కూడా మారనున్నాయి. దీంతో ఎన్నికల ప్రక్రియ మరింత జాప్యం కానుంది. మూడేళ్లుగా మండల ప్రజాపరిషత్‌కు పాలకవర్గం లేకపోవటంతో ప్రజా సమస్యల పరిష్కారానికి ఇబ్బందికర పరిస్థితులున్నాయి. మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాలు జరగకపోవటంతో మండల స్థాయిలో సమస్యలను ఏకరువు పెట్టుకునే పరిస్థితులు లేవు. మరో ఏడాది కాలంలో రాష్ట్రంలోని అన్ని మండల పరిషత్‌ల పాలకవర్గాల పదవీకాలం ముగుస్తుంది. ఈ పరిస్థితుల్లో బూర్గంపాడు మండల పరిషత్‌కు ఎన్నికలు జరగటం ప్రశ్నార్థకమేనని ప్రచారం సాగుతోంది. అసెంబ్లీ ఎన్నికల ముందు మండల పరిషత్ ఎన్నికలు జరగటం అనుమానమే. ఈ పరిస్థితులు రాష్ట్రంలోని అన్ని మండల పరిషత్‌లకు ఎన్నికలు జరిగినప్పుడే బూర్గంపాడు మండల పరిషత్‌కు కూడా ఎన్నికలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఎన్నికలు నిర్వహించాలి



మండల పరిషత్‌కు ఎన్నికలు నిర్వహించాలి. ఎంపీటీసీ ఎన్నిలకు జరగకపోవటంతో పరిషత్ నిధులు గ్రామాలకు రావటం లేదు. మండల స్థాయిలో జరగాల్సిన సర్వసభ్య సమావేశాలు జరగకపోవటంతో ప్రజల సమస్యలపై జవాబుదారీ తనం లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు మండల పరిషత్‌కు ఎన్నికలు నిర్వహించాలి.

– ఏనుగుల వెంకటరెడ్డి, బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి

ప్రభుత్వ ఆదేశానుసారం చర్యలు



మండల పరిషత్ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వ ఆదేశానుసారం చర్యలు తీసుకుంటాం. ఎన్నికల కోసం గతంలో 14 ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు చేశాం. ఓటరు లిస్టులు తయారు చేశాం. ప్రస్తుతం సారపాక, ఐటీసీ కొత్త గ్రామపంచాయతీలు కూడా మండల పరిషత్‌లోకి వస్తాయి. ఈ నేపథ్యంలో మళ్లీ ఎంపీటీసీ స్థానాల సంఖ్య, రిజర్వేషన్ల ప్రక్రియ చేపట్టాల్సి ఉంది.

– వివేక్‌రామ్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి

నిలువ నీడ కరువు



బస్ షెల్టర్ లేని మోరంపల్లి బంజర ప్రధాన కూడలి

బూర్గంపాడు: మోరంపల్లిబంజర ప్రధానకూడలిలో ప్రయాణికులకు నిలువనీడ కరువైంది. ఎండైనా, వానైనా ప్రయాణికులకు ఇబ్బందులు తప్పటం లేదు. గతంలో పాల్వంచ లయన్స్ క్లబ్ మోరంపల్లిబంజర ప్రధానకూడలిలో బస్‌షెల్టర్‌ను నిర్మించారు. ప్రయాణికుల రాకపోకలకు ఈ బస్ షెల్టర్ ఎంతగానో ఉపయోగపడింది. మూడేళ్ల క్రితం జాతీయ రహదారి(ఎన్‌హెచ్–221) విస్తరణలో భాగంగా ఈ బస్‌షెల్టర్‌ను తొలగించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు బస్‌షెల్టర్ లేకపోవటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అనునిత్యం వందలాదిమంది ఇక్కడ నుంచి రాకపోకలు సాగిస్తారు. టీఎస్ ఆర్టీసీతో పాటుగా ఏపీఎస్ ఆర్టీసీ కూడా ఈ గ్రామంలో బస్సులను నిలుపుదల చేసి ప్రయాణికులను ఎక్కించుకుంటారు. అదేవిధంగా ప్రైవేటు బస్సులు కూడా ఈ కూడలిలో ఆగి ప్రయాణికులను తీసుకెళ్తుంటాయి. అయితే బస్‌షెల్టర్ లేకపోవటంతో ప్రయాణికుల ఇబ్బందులను ఎవరూ పట్టించుకోవటం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు బస్‌షెల్టర్ నిర్మాణానికి చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

అశ్వారావుపేటరూరల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పాల్వంచ సబ్ డివిజన్ పరిధిలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ ఎస్.వెంకటేష్ సూచించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జోరుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని వాగులు, వంకలు, చెరువులు, కుంటల్లోకి వరదనీరు చేరుతోందని, చెరువులు, కుంటలు తెగిపోయి, వాగులు ఉధృతం ప్రవహించి ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉంటాయని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పశువుల కాపరులు, చేపల వేటకు వెళ్లే వారితోపాటు, చిన్నారులు జాగ్రత్తగా ఉండాలని కోరారు.

విద్యుత్ ప్రమాదాలు, వాగులు, చెరువుల వద్ద జరిగే ప్రమాదాల గురించి ఆయా ప్రాంతాల్లోని ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు, పోలీస్ యూత్ క్లబ్ సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. మరో ఐదు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణం శాఖ హెచ్చరికల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల వాసులు కూడా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రకటన విడుదల చేసిన వారిలో సీఐ బి.బాలకృష్ణ, ఎస్సై రాజేశ్ కుమార్ తదితరులున్నారు.

ఉపాధ్యాయ సంఘాల బైక్ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

మణుగూరురూరల్: నూతన పే–రివిజన్ కమిటీని ఏర్పాటు చేయాలని, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఐక్య ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో యుఎస్‌పీసీ, యూటీఎఫ్ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన పే–రివిజన్ కమిటీని ఏర్పాటు చేసి మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఉపాధ్యాయులు పదోన్నతులు, బదిలీలను వెంటనే చేపట్టాలని కోరారు. విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని, కేజీబీవీ, రెసిడెన్షియల్, వ్యాయామ ఉపాధ్యాయులు, బాష పండితుల సమస్యలను పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మీరాహుస్సేన్, కారం సీతారామయ్య, మేరెడ్డి ఇంద్రసేనారెడ్డి, బి.వెంకన్న, రత్నప్రసాద్, టి.విజయలక్ష్మి, సమ్మయ్య, నరేష్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలి

బూర్గంపాడు: ఐటీసీ పీఎస్‌పీడీకి గోదావరి నుంచి నీటిని తరలించే పైప్‌లైన్ల కింద భూములు కోల్పోయిన ఇరవెండి గిరిజన రైతులకు తక్షణమే ఉద్యోగాలివ్వాలని తెలంగాణ జనసమితి రాష్ట్ర అధికార ప్రతినిధి పంపన శివప్రసాద్ డిమాండ్ చేశారు. సారపాకలో బుధవారం భూనిర్వాసిత రైతులతో కలసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 45 ఏళ్ల క్రితం భూసేకరణ తరువాత ఇప్పుడు పైప్‌లైన్లను విస్తరించేందుకు గిరిజన రైతుల భూముల్లోకి ఏ అధికారంతో ఐటీసీ, రెవెన్యూ అధికారులు అడుగుపెడుతున్నారని ప్రశ్నించారు. కొందరు బడాబాబులతో గిరిజనులను భయభ్రాంతులకు గురిచేసి పైప్‌లైన్ల పనులు జరిపేందుకు యత్నిస్తున్నారన్నారు. ఈ ప్రయత్నాలను అడ్డుకుంటున్న గిరిజనులపై కేసులు పెడతామని, పోలీస్ ప్రహారాతో పనులు జరిపిస్తామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఇరవెండి గిరిజన రైతుల భూములు సేకరించకుండానే వారి భూముల నుంచి పైప్‌లైన్ ఏవిధంగా వేశారని ప్రశ్నించారు. ఐటీసీ పీఎస్‌పీడీ 8వ యూనిట్ విస్తరణను స్వాగతిస్తున్నామని, అయితే పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించిన తీరు అభ్యంతరకరమన్నారు. పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణను మరోమారు చేపట్టాలని, లేదంటే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని హెచ్చరించారు. సమావేశంలో టీడీపీ పినపాక నియోజకవర్గ ఇన్‌చార్జ్ తాతా మాధవీలత, టీజేఎస్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, కనకరాజు, దాసరి రమేష్, ఇరవెండి మాజీ సర్పంచ్ అరియం శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణంపై హర్షం

మణుగూరురూరల్: మండలంలోని కూనవరం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న కోడిపుంజుల వాగుపై హైలెవల్ బ్రిడ్జిని నిర్మించడం పట్ల ఇఫ్టూ నాయకుడు మంగీలాల్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన వాగుపై నిర్మించిన బ్రిడ్జిని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా సింగరేణి కార్మికులు, సీటైప్ అధికారులు, పరిసర ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న కోడిపుంజుల వాగు లోలెవల్ రోడ్డు సమస్యను స్థానిక ప్రజాప్రతినిధులు, సింగరేణి యాజమాన్యం పరిష్కరించడం హర్షణీయమన్నారు. కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కె.గురుమూర్తి, జి.నాగేశ్వరరావు, ఎం.సాంబశివరావు, రజబ్‌అలీ, టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ ఫర్ గర్ల్స్ ముగింపు వేడుకలు



దమ్మపేట: నాటకం ప్రదర్శించిన విద్యార్థులతో వాయిస్ ఫర్ గర్ల్స్ టీమ్, పాఠశాల సిబ్బంది

దమ్మపేట: మండల పరిధిలోని దుర్గం గొల్లగూడెం బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో వాయిస్ ఫర్ గర్ల్స్–దిశ ముగింపు వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. దుర్గం గొల్లగూడెం ఆశ్రమ పాఠశాలలో జరిగిన దిశ క్యాంపులో గొల్లగూడెం, భీముడిగూడెం, అశ్వారావుపేట, అనంతారం, కావడిగుండ్ల బాలికల ఆశ్రమ పాఠశాలలకు చెందిన 265 మంది విద్యార్థులు పాల్గొన్నారు. బుధవారం ముగింపు వేడుకల సందర్భంగా బాలికల విద్య, హక్కులు, పరిశుభ్రత, ఆరోగ్యం, భవిష్యత్తు ప్రణాళికలు తదితర అంశాలపై అవగాహన కలిగేలా విద్యార్థులతో పది విభిన్న రకాల నాటక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ.. నేటి బాలికలు వారి హక్కులను తెలుసుకోవడమే కాక, రేపటి సమాజంలో ఉన్నత విద్యను అభ్యసించి, భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో స్థిరపడటానికి ఈ దిశ కార్యక్రమం దోహదం చేస్తుందని పేర్కొన్నారు. దిశ కోఆర్డినేటర్లు మనీషా, అక్షిత, రీచా, వార్డెన్ జ్యోతి పాల్గొన్నారు.

ప్రతి సమస్యనూ ధైర్యంతో ఎదుర్కొవాలి

భద్రాచలంటౌన్: సమాజంలోని ప్రతి సమస్య విద్యార్థినులు ధైర్యంతో ఎదుర్కొవాలని, అప్పుడే విజయం సాధించవచ్చని ఏపీఎంఓ రమణయ్య అన్నారు. భద్రాచలం పట్టణంలోని గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన వాయిస్ ఫర్ గర్ల్స్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థినులు సమస్యలను మనసులో పెట్టుకోకుండా తోటి విద్యార్థులకు, తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏటీడీఓ నరసింహారావు, హెచ్‌ఎం సామ్రాజ్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సోషల్ మీడియా కో–ఆర్డినేటర్‌గా గాదెగోని

ములకలపల్లి: యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా జిల్లా కో–ఆర్డినేటర్‌గా మండల పరిధిలోని జగన్నాథపురానికి చెందిన గాదెగోని వెంకటేశ్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా నేషనల్ హెడ్ మనుజైన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు వెంకటేశ్ తెలిపారు.

కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదం ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్సై బి.రాజేశ్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నల్లబాడు గ్రామానికి చెందిన పోజారి రాములు అనే యువకుడు, మారుతీనగర్‌కు చెందిన కేధార్ నాని ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా రాగా, అదుపుతప్పి గత నెల 29వ తేదీన అశ్వారావుపేటలోని దొంతికుంట దగ్గర ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో రాములు అనే యువకుడి కాలు విరగ్గా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీనిపై బుధవారం రాత్రి రాములు తండ్రి పోతురాజు ఫిర్యాదు మేరకు నానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మణుగూరులో విస్తారంగా వర్షాలు



లోతట్టు ప్రాంతాల్లోకి చేరిన వరద నీరు



కట్టువాగు ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేగా కాంతారావు

మణుగూరురూరల్: గత రెండు రోజులుగా మణుగూరులో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండడంతో.. చెరువులు, కుంటల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షాలకు వరదనీరు ఇళ్లల్లోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతలు సైతం నిలిచిపోయాయి. గనుల్లోని రోడ్లు బురదమయం కావడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి.

వర్ష ప్రభావిత ప్రాంతాల్లో రేగా పర్యటన..

గత రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు బుధవారం వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లోని డ్రైనేజీలను, కాలువలను, ప్రధాన రహదారిపై గల బ్రిడ్జిలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తుండడంతో వాగులు, వంకలు, కాలువలు, డ్రైనేజీలు పొంగి ప్రవహిస్తున్నాయన్నారు. వర్షాలు మరో మూడు రోజుల పాటు కురియనున్న నేపథ్యంలో ఎలాంటి నష్టం కలగకుండా సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వర్ష ప్రభావిత గ్రామాలు, పట్టణాల నుంచి నివేదికలు తెప్పించి పరిస్థితులకు అనుగుణంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కల్వర్టులు, బ్రిడ్జిలు, ప్రమాదక ప్రాంతాల్లో హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. స్థానికంగా ఉన్న రెవిన్యూ, పోలీస్, విద్యుత్, నీటిపారుదలశాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

సమస్యలపై దశలవారీ పోరాటం



గుండాల: నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు



దమ్మపేట: సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకుడు భాస్కరరావు

గుండాల: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించేంత వరకు దశలవారీగా పోరాటాలు చేస్తుంటామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నరాటి ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆళ్లపల్లి మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కారోబార్స్, బిల్ కలెక్టర్లు, స్వీపర్లు, ఎలక్ట్రీషియన్స్, డ్రైవర్స్, వాటర్‌మెన్ తదితర కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. జీవో 60 ప్రకారం కనీస వేతనం చెల్లించాలని, పని గంటలను 8 గంటలకు పరిమితం చేయాలని కోరారు. ఇతర సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సర్పంచ్, కార్యదర్శులకు అందించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ యూసఫ్, ఏఐటీయూసి గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ సలహాదారులు, జేఏసీ జిల్లా కమిటీ సభ్యుడు కిషోర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రేసు ఎల్లయ్య, కోఆప్షన్ సభ్యులు రహీం, సురేందర్, హన్మంతరావు, వజ్జ పగడయ్య, ప్రభుదాసు, శేఖర్, రాజయ్య, కన్నయ్య, అనసూర్య, మునలయ్య, కృష్ణ కుమారి, ప్రమీల, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గుండాలలో..

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. చేపట్టిన సమ్మెలో భాగంగా మండల కేంద్రంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బాటన్న, నర్సయ్య, చిరంజీవి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు డి.పున్నంచంద్ డిమాండ్ చేశారు. బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వెట్టిచాకిరి చేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ 19వేల వేతనం చెల్లించాలని కోరారు. సమ్మె చేస్తున్న గ్రామపంచాయతీ సిబ్బందితో ప్రభుత్వం చర్చలు జరిపి డిమాండ్ల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని అన్నారు.

జేఏసీ సమావేశం..

దమ్మపేట: గ్రామ పంచాయతీ కార్మికుల 14వ రోజు సమ్మెలో భాగంగా, మండల కేంద్రంలో కార్మికుల జేఏసీ సమావేశం నిర్వహించారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు యార్లగడ్డ భాస్కరరావు మాట్లాడుతూ.. గత 14 రోజులుగా పంచాయితీ కార్మికులు నిరవధిక సమ్మె చేస్తున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం స్పందిచకపోవడం శోచనీయమని అన్నారు. తెలంగాణ రాష్ట్రం వస్తే కాంట్రాక్టు కార్మికులు అందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని చెప్పిన సీఎం కేసీఆర్.. ఇప్పుడు అందకు విరుద్ధంగా కార్మికులను చిన్నచూపుతో చూస్తున్నారని వాపోయారు. సమావేశంలో జేఏసీ నాయకులు అమర్లపూడి రాము, పిట్టల అర్జున్, ధర్మ, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పనులను అడ్డుకున్న కార్మికులను సముదాయిస్తున్న పోలీసులు

చెత్త సేకరణను అడ్డుకున్న కార్మికులు

అశ్వారావుపేట: గతకొద్ది కాలంగా పంచాయతీ కార్మికులు సమ్మెలో ఉండటంతో బుధవారం అశ్వారావుపేట మేజర్ పంచాయతీలో చెత్త సేకరణ చేసేందుకు కూలీలను నియమించగా కార్మికులు అడ్డుకున్నారు. ఈఓ హరికృష్ణ విషయాన్ని అశ్వారావుపేట ఎస్సై రాజేష్‌కుమార్‌కు తెలియజేయడంతో ఇరుపక్షాల మధ్య చర్చలు జరిపారు. అయినప్పటికీ చెత్త తొలగింపుకు వేరే వ్యక్తులను నియమించడాన్ని కార్మికులు అంగీకరించలేదు.